# దసరా మహోత్సవాలకు అంకురార్పణ

■ శ్రీశైలంలో శైలపుత్రిగా దర్శనమిచ్చిన భ్రామరి ■ భృంగివాహనంపై ఆసీనులైన ఆదిదంపతులు




శ్రీశైలంలో శైలపుత్రిదేవీగా దర్శనమిచ్చిన అమ్మవారు

శ్రీశైలం అక్టోబర్ 15 : శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవ వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి దేవస్థాన కార్యనిర్వాహణాధికారి పెద్దిరాజు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఆదివారం ఉదయం పసుపు కుంకుమ, పూలు పండ్లతో ఆలయ ముఖద్వారం నుంచి ఆలయ ప్రవేశం చేసి ప్రదక్షిణలు చేశారు. అనంతరం అర్చక వేదపండితులు అమ్మవారి యాగశాల ప్రవేశం గణపతిపూజ, అఖండదీపస్థాపన, దీక్షా సంకల్పం, ఋత్విగరణం, మండపారాధన, చతుర్వేద పారాయణాలు, చండీ సప్తశతీ, మహావిద్య పారాయణ కార్యక్రమాలు జరిపించారు. అదేవిధంగా స్వామివారి ఆలయ యాగశాల ప్రవేశం, శివసంకల్పం, గణపతి పూజ, చండీశ్వర పూజ, వాస్తు పూజ, రుద్రకలశ స్థాపన, స్వామివారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం తోపాటు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి సువాసినీ పూజ, కాళరాత్రిపూజలతో తొలిరోజు నవరాత్రి మహోత్సవం శాస్త్రోక్తంగా జరిపించినట్లు ఆలయ స్థానాచార్యులు పూర్ణానంద ఆరాధ్యులు తెలిపారు. లోక కల్యాణం కోసం జరిపే నవరాత్రి మహోత్సవాల వల్ల దేశ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, అతివృష్టి, అనావృష్టి నివారించబడి పంటలు బాగా పండి రైతాంగం సుభిక్షంగా ఉండాలని మహాసంకల్పాన్ని ఋత్వికలు పఠించారు.

### శైలపుత్రిదేవీగా దర్శనం

దేవీశరన్నవరాత్రి మహోత్సవల్లో భాగంగా తొలి రోజు ఉత్సవం వైభవంగా సాగింది. ఆదివారం భ్రామరీ అమ్మవారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై శైలపుత్రి రూపంలో అలంకరించి విశేష పూజలు చేశారు. దేవీ ద్విభుజాలు కలిగి కుడి చేతిలో త్రిశూలం, ఎడమ చేతిలో కమలం ధరించి వృషభ వాహనంపై దర్శనమిచ్చింది. సతీదేవి ఉత్తర జన్మలో పర్వతరాజు అయిన హిమవంతుడికి పుత్రికగా జన్మించడం వల్ల శైలపుత్రిగా పేరుపొందింది. ఈదేవిని పూజించడం వల్ల విశేష ఫలితాలతోపాటు సర్వత్రా విజయాలు వరిస్తాయి. అనంతరం అక్క మహాదేవి అలంకార మండపంలో శ్రీభ్రామరి సహిత మల్లికార్జునుడు భృంగివాహనాన్ని అధిష్ఠించి భక్తులను కటాక్షించారు. స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అలంకరింపజేసి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. గ్రామోత్సవంలో భాగంగా స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులు గంగాధర మండపం నుంచి మొదలుకొని నంది మండపం వరకు, నంది మండపం నుంచి బయలు వీరబద్రస్వామి వరకు విహరిస్తూ భక్తాదులను కరుణించారు. గ్రామోత్సవంలో నాదస్వరం, మహిళా,పురుష వీరగాని కన్నడ జానపద కళాప్రదర్శన, రాజభటుల వేషాలు, కేరళ వారి కథకళి వేషాలు, తప్పెట చిందు, లంబాడి నృత్యం, కాళికా నృత్యం, చెక్కభజన, కోలాటం, ఢమరుకం, చిడతలు, శంఖం, పిల్లగ్రోవి, త్రిశూలం, జేగంట, కురవడోలు, కొమ్ము, నందికోలు సేవ మొదలగు వివిధ రకాల విన్యాసాలతో ఆధ్యాంతం కనులపండువగా సాగింది. కార్యక్రమంలో చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో పెద్దిరాజు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపాక్షయ్యస్వామి, విజయలక్ష్మి, కనకదుర్గ,మేరాజోత్ హనుమంత్ నాయ క్, మధుసూదన్‌రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు తన్నీరు ధర్మరాజు, ఏఈవోలు మోహన్, హరిదాస్, ఫణిధర్, పర్యవేక్షకులు స్వాములు, రవి, అర్చకులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకులను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

# బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు

■ సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యేలు గువ్వల , మర్రి

అచ్చంపేటరూరల్, అక్టోబర్ 15 : ఎన్నికలు దగ్గర పడుతుండడంతో మండలంలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. ఆదివారం సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టో విడుదల చేసి అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించారు. దీంతో హైదరాబాద్‌లోని బీఆర్‌ఎస్ కేంద్ర కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో అచ్చంపేట మండలంలోని అక్కారం, ఘణపూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచులు రాజేశ్‌నాయక్, కృష్ణవేణీరవి ఆధ్వర్యంలో 50మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి విప్ గువ్వల గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు విప్ గువ్వల సీఎం కేసీఆర్ నుంచి బీ ఫాం అందుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

### ఎమ్మెల్యే మర్రి సమక్షంలో..

తిమ్మాజిపేట, అక్టోబర్ 15 : తిమ్మాజిపేట మండలంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి షాక్‌లు తగులుతున్నాయి. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న ప్రజారంజక పాలన, నియోజకవర్గంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్ నాయకులు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో మండలంలోని కోడుపర్తి, గొరిట, హనుమాన్‌తండాకు చెందిన 200 మంది ఎమ్మెల్యే మర్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్, ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకులను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



తిమ్మాజిపేటలో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

# మ్యానిఫెస్టో విడుదలపై సంబురాలు

■ సీఎం కేసీఆర్ నుంచి బీఫాం అందుకున్న ఎమ్మెల్యేలు

■ పటాకులు కాల్చి, స్వీట్లు పంచుకున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 15 : బీఆర్‌ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను ఆదివారం సీఎం కేసీఆర్ విడుదల చేయడంతోపాటు పార్టీ నుంచి నాగర్‌కర్నూల్ అభ్యర్థిగా ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బీఫారం అందుకోవడంతో కందనూలు జిల్లా కేంద్రం సంబురపడింది. గులాబీ దళపతి ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా మర్రి బీఫారం అందుకున్నారన్న సమాచారం తెలుసుకున్న వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు వేడుకల్లో మునిగితేలారు. నాగర్‌కర్నూల్ అభ్యర్థిగా నియమించి బీఫారం అందుకోవడం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో పటాకులు కాల్చారు. స్వీట్లు పంచుకొని మర్రి గెలుపు మూడోసారి కూడా తథ్యమంటూ నినదించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో మరోసారి సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని పేర్కొన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని వివిధ మండల కేంద్రాల్లోనూ బీఆర్‌ఎస్ నాయకులు పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్‌యాదవ్, సింగిల్‌విండో చైర్మన్ బండారు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మాధవరెడ్డి, కౌన్సిలర్లు, ఇసాక్, జక్కా రాజ్‌కుమార్‌రెడ్డి, నాయకులు పాండుచారి, హరికృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు బాదం రమేశ్‌తోపాటు పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తాడూరులో స్వీట్లు తినిపించుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు



చాంపియన్‌గా నిలిచిన కల్వకుర్తి జట్టుకు షీల్డ్ అందజేస్తున్న ఆర్‌సీవో

# ముగిసిన గిరిజన గురుకుల క్రీడోత్సవాలు

కల్వకుర్తి, అక్టోబర్ 15 : కల్వకుర్తి పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో/ కళాశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న 4వ జోన్ స్థాయిలో గురుకుల గిరిజన బాలికల విద్యాసంస్థల క్రీడోత్సవాలు ఆదివారం ముగిశాయి. మూడు రోజులుగా అండర్, 14,17,19 విభాగాల్లో వివిధ అంశాలతో కూడిన క్రీడల్లో 13 పాఠశాలలు, కళాశాలలకు చెందిన 620 మంది విద్యారినులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అండర్-14 విభాగంలో కబడ్డీ విభాగంలో కల్వకుర్తి జట్టు విజేతగా, జడ్చర్ల జట్టు రన్నర్‌గా, వాలీబాల్‌లో కల్వకుర్తి విజేతగా, వనపర్తి రన్నర్‌గా నిలిచాయి. అండర్-17 విభాగంలో కబడ్డీలో తాండూర్ విన్నర్‌గా, కేటీదొడ్డి రన్నర్‌గా, వాలీబాల్‌లో అచ్చంపేట విన్నర్‌గా, జడ్చర్ల రన్నర్‌గా, ఖోఖోలో తాండూర్ విన్నర్‌గా, మహబూబ్‌నగర్ జట్లు రన్నర్‌గా నిలిచాయి. అండర్-19 విభాగంలో కబడ్డీలో వనపర్తి విజేతగా, కల్వకుర్తి రన్నర్‌గా, వాలీబాల్‌లో కల్వకుర్తి విజేతగా, వనపర్తి రన్నర్‌గా, ఖోఖోలో కల్వకుర్తి విజేతగా, జడ్చర్ల జట్లు రన్నర్‌గా నిలిచాయి. వీటితోపాటు వివిధ క్రీడల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఆర్‌సీవో నాగార్జున, జోన్ 4లోని గురుకుల గిరిజన బాలికల విద్యాసంస్థల ప్రధాన ఆచార్యులు బహుమతులు అందజేశారు.

### చదువు, ఆటలు రెండు కళ్లలాంటివి

విద్యార్థులకు చదువు, ఆటలు రెండు కళ్లలాంటివని ఉమ్మడి పాలమూరు జిల్లా గిరిజన గురుకుల విద్యాసంస్థల రీజనల్ కోఆర్డినేటర్ నాగార్జున అన్నారు. విజ్ఞానం కోసం చదువు, జీవిత మనుగడ, సంతోషం, సహనం, క్రీడాస్ఫూర్తి కోసం ఆటపాటలు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల్లో చదువుతోపాటు,క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. గురుకులాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న విషయాలను ఉదహరించారు.

### ఘనంగా దసరా సంబురాలు..

క్రీడోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థిను లు, విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయినులు ఆటాపాటలతో సరదగా గడిపారు. బొడ్డెమ్మలు పేర్చి బతుకమ్మలు ఆడారు. గిరిజన సంప్రదాయ నృత్యాన్ని మమేకం చేస్తూ విద్యార్థినులు ఆడిన బతుకమ్మ ఆటలు ఎంతగానో అలరించారు. తెలంగాణ, సంస్కృతి, సంప్రదాయాలను విడమర్చి, వివరిస్తూ ఆలపించిన గీతాలకు అద్భుతంగా ఆడారు. దాదాపు 700 మంది విద్యార్థినులు ఒక్కసారిగా బతుకమ్మ ఆటలు ఆడుతుం టే.. ఆ ప్రాంగణమంతా పెద్ద ఉత్సవంగా మారింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాతరావు, అధ్యాపకులు, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆటలు జీవితంలో భాగం కావాలి

■ ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియాన్ని ప్రారంభించిన కామన్‌వెల్త్ గోల్డ్ మెడల్ విజేత దీప్తి. అంతర్జాతీయ హాకీ ఆటగాడు నిజాముద్దీన్

కల్వకుర్తి, అక్టోబర్ 15 : వయస్సుతో సంబంధం లేకుండా ఆటలు జీవితంలో ఒక భాగం కావాలని బ్యాడ్మింటన్ కామన్‌వెల్త్ బంగారు పతకం విజేత సీహెచ్ దీప్తి, అంతర్జాతీయ హాకీ ఆటగాడు నిజాముద్దీన్ అన్నారు. ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని అక్షరవనంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియాన్ని కామన్‌వెల్త్ బంగారు పతకం విజేత, దీప్తి, అంతర్జాతీయ హాకీ ఆటగాడు నిజాముద్దీన్ ప్రారంభించారు. అదే విధంగా ఒక రోజు పాటు సాగే బ్యాండ్మింటన్ టోర్నీని కూడా ఆరంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బ్యాడ్మింటన్ స్టేడియాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా క్రీడల్లో పాలుపంచుకోవాలని, శారీరక, మానసిక ఆరోగ్యానికి చాలా మేలు చేకూరుస్తుందని అన్నారు. ఆటలు మెదడుకు పదునుకూడా పెడతాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా బ్యాడ్మింటన్ కోర్టు నిర్మాణానికి సహకరించిన దాతలను బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో గార్డియన్ స్కూల్ వ్యవస్థాకుడు రామకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, జగన్, మధు, శశాంక్, నారాయణరెడ్డి, అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అంతర్జాతీయ హాకీ ప్లేయర్ నిజాముద్దీన్